క్లుప్తంగా

ఇంటి వద్దకే వైద్యం



స్వరూపను పరీక్షిస్తున్న డాక్టర్ నాగేంద్ర

దొర్నిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి ఇంటి వద్దకే వైద్యాన్ని తీసుకొచ్చినట్లు పీహెచ్‌సీ డాక్టర్ నాగేంద్ర తెలిపారు.శనివారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని పక్షవాత రోగి చంద్రారెడ్డి, మస్తిష్క పక్షవాతంతో బాధపడుతున్న స్వరూపకు ఇంటివద్దకే వచ్చి వైద్యపరీక్షలు చేశారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.కార్యక్రమంలో ఏఎన్‌ఎం మాణిక్యమ్మ, రామారావు, సూపర్‌వైజర్ స్వరూపరాణి, ఆశా వర్కర్లు లక్ష్మి, లత తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలి

నంద్యాల(అర్బన్): కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని ఏపీ జేఏసీ అమరావతి నంద్యాల జిల్లా చైర్మన్ రామచంద్రారావు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరావు కోరారు. ఏపీ జేఏసీ అమరావతి మూడవ దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఉద్యోగుల వేదనను చెబుదాం కార్యక్రమంలో నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వారు వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, విజయశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

నంద్యాల(అర్బన్): ఇకపై ఎన్నికలు జరిగే ప్రతి రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య తెలిపారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిందన్నారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడంతో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నూనెపల్లె, బొగ్గులైన్, గాంధీనగర్ ప్రాంతాల్లో మిఠాయిలు పంచారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మతతత్వ బీజేపీ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఎన్నికల ముందు నరేంద్రమోదీ, అమిత్‌షాలు మత రాజకీయాలు చేశారన్నారు. దీనిని కర్ణాటక ఓటర్లు తిప్పికొట్టారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఊకొట్టువాసు, బాలకృష్ణ, మస్తాన్‌ఖాన్, రామకృష్ణ, ఎస్‌వైడీ ప్రసాద్, చాబోలు సలాం, ఆర్టీసీ ప్రసాద్ పాల్గొన్నారు.

విజయ యాత్రను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బజరంగదళ్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించే వీర హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని బజరంగదళ్ కన్వీనర్ శ్రీకాంత్ కోరారు. శనివారం ఆయన స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బైక్ ర్యాలీలో యువకులు, మహిళలు, కుల సంఘాలు, వ్యాపార సంఘాల నాయకులు పాల్గొనాలనికోరారు. మధ్యాహ్నం 4 గంటలకు టెక్కె మార్కెట్‌యార్డు నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, లింగేశ్వరబాబు, సత్యనారాయణ, వరప్రసాద్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మోదీ రాజీనామా చేయాలి

నంద్యాల(అర్బన్): కర్ణాటక రాష్ట్రంలో జరిగిన శాసన సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షాలు పదవులకు రాజీనామా చేయాలని ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక కన్వీనర్ అబులైజ్ డిమాండ్ చేశారు. స్థానిక ఆవాజ్ కమిటీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక ఓటర్లు బీజేపీకి గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. కార్యక్రమంలో బిషప్ మరియ రాజు భాస్కర్, పాస్టర్ జానయ్య, అబ్దుల్‌సమ్మద్, మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి పరిష్కారం

నంద్యాల(రూరల్): గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పదిరోజుల క్రితం నంద్యాల మండలం కానాల గ్రామంలో నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పర్యటించారు. ప్రమాదకరంగా రహదారిపై వేలాడుతున్న 11కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల విద్యుత్ అధికారి శ్రీనివాసులుకు ఆదేశించారు. నాలుగురోజులుగా ఏఈ గ్రామంలో తిష్ట వేసి 11కేవీ విద్యుత్ తీగలు రహదారిపై వెళ్లే వాహనాలకు తాకకుండా ఎత్తులో అమర్చారు. సమస్య తీరడంతో కానాల గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, విద్యుత్ అధికారులకు శనివారం కృతజ్ఞతలు తెలిపారు.

పచ్చిరొట్ట..భూమికి రక్ష!

- సాగుతో భూసారం పెరుగుదల
- మొక్కలకు అవసరమైన పోషకాల లభ్యత
- సూక్ష్మ జీవుల వృద్ధి, అధిక పంట దిగబడులకు దోహదం
- జిల్లాకు 4,905 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువుల మంజూరు



పచ్చిరొట్ట పంట

నంద్యాలఅర్బన్: పచ్చిరొట్ట పైర్ల సాగుతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా నేలను సారవంతం చేసి అధిక దిగుబడులకు దోహదం చేస్తుంది. ప్రస్తుతం అధిక మోతాదులో వేసే రసాయనిక ఎరువులతో భూములు నిస్సారమవుతాయి. పచ్చిరొట్ట పైర్ల సాగుతో ఈసమస్యను అధిగమించవచ్చు.భూమిని సారవంతం చేసుకోవడానికి వరిపంట వేసే పొలంలో పచ్చిరొట్ట ఎరువులు అయిన జీలుగలు, పిల్లి పెసర, జనుము, పంటలను వేసి పూత సమయంలో కలియ దున్నడం ద్వారా నేల సారవంతమై అధిక దిగుబడులు సాధించడానికి దోహదం చేస్తాయన్నారు. ఇందు కోసం జిల్లాలోని ఖరీఫ్ సీజన్ వరి రైతులకు 4,905 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు మంజూరు అయ్యాయని అందులో 4,675 క్వింటాళ్ల జీలుగలు, 225 క్వింటాళ్ల పిల్లి పెసర, 3 క్వింటాళ్ల జనుము విత్తనా లు ఉన్నాయన్నారు.కావాల్సిన రైతులు రైతు భరో సా కేంద్రాన్ని సంప్రదించి గ్రామ వ్యవసాయ సహా యకుల ద్వారా డి-క్రిష్ దరఖాస్తులో రిజిస్ట్రేషన్ చేయించుకొని రైతు వాటా డబ్బులు చెల్లిస్తే ఏపీ సీడ్స్‌ద్వారా నాణ్యమైన విత్తనాలు అందుతాయన్నారు.

లాభాలు అనేకం

పచ్చిరొట్ట పైర్లను భూముల్లో కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుంది. భూమి బాగా గుల్ల వారుతుంది.భూమిలో స్థూల,సూక్ష్మపోషకాల లభ్యత పెరుగుతుంది. భూమికి తేమను ఎక్కువ రోజులు నిలుపుకునే శక్తి వస్తుంది. పంట నాణ్యత పెరుగుతుంది. పంటకు మార్కెట్లో మంచి ధర పలుకుతుంది. పచ్చిరొట్ట పైర్లకు వేరు బుడిపెలు ఉండటం ద్వారా నత్రజనిని స్థిరీకరిస్తాయి. సారవంతమైన నేలలను చౌడు భూములుగా మారకుండా నివారిస్తాయి. ఒకవేళ భూముల్లో ఏదైనా లవణాల సంఖ్య ఎక్కువగా ఉంటే వాటిని తగ్గించి సారవంతమైన భూమిగా చేస్తాయి.

ముఖ్యమైన పచ్చిరొట్ట పైర్లు..

పచ్చిరొట్ట ఎరువును ప్రత్యేకంగా పెంచి పూత వచ్చే దశలో భూమిలో కలియదున్ని తగినంత నీరు పెట్టి కుళ్లనివ్వాలి. ఉదాహరణకు జీలుగ, జనుము, పిల్లిపెసర.

పచ్చి ఆకు ఎరువు..

పచ్చిరొట్ట ఎరువును పండించడానికి అవకాశం లేనప్పుడు పచ్చిరొట్ట చెట్ల ఆకులు, లేత కొమ్మలు బయటి నుంచి తెచ్చి పొలంలో వేసి కలియదున్నాలి. తగినంత నీరు పెట్టి కుళ్ల నివ్వాలి. ఉదాహరణకు నేల తంగెడి, సుబాబుల్, గానుగ, తదితరాలు.

పచ్చిరొట్ట ఎరువుల ఎంపికలో జాగ్రత్తలు...

పచ్చిరొట్ట పైర్లు త్వరగా పెరిగి ఆకులు ఎక్కువ నిచ్చి కాండం మెత్తగా ఉండాలి. కాండం మృదువుగా ఉండి



ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

త్వరగా కుళ్లే స్వభావం కలిగి ఉండాలి. అన్ని నేలలకు నీటి ఎద్దడికి తట్టుకొనేలా ఉండాలి. తక్కువ సారమున్న నేలల్లో కూడా ఏపుగా పెరిగి పచ్చిరొట్టనిచ్చేదిగా ఉండాలి. పచ్చిరొట్ట పైర్ల వేర్లు భూమిలోకి లోతుగా చొచ్చుకు పోయే గుణం కలిగి ఉండాలి.

నంద్యాల జిల్లాలోని మండలాలకు మంజూరైన పచ్చిరొట్ట ఎరువుల వివరాలు క్వింటాళ్లలో..

మండలం	జీలుగలు	పిల్లిపెసర	జనుము
డోన్	-	-	-
బేతంచెర్ల	-	-	-
ప్యాపిలి	2	10	-
మిడుతూరు	6.5	10	-
పగ్యిడాల	5.4	4.0	
జూపాడుబంగ్లా	38	21	-
ఆత్మకూరు	125	10	=
వెలుగోడు	150	13	-
పాములపాడు	150	12	-
కొత్తపల్లి	73	5	-
నంద్యాల	250	5	10
మహానంది	350	-	-
బండిఆత్మకూరు	934	2	-
పాణ్యం	130	10	-
గడివేముల	118.5	12	-
బనగానపల్లె	150.5	31	-
ఆళ్లగడ్డ	320	-	10
రుద్రవరం	660	5	-
శిరివెళ్ల	420	-	-
చాగలమర్రి	280	-	-
గోస్పాడు	120	20	-
కోవెలకుంట్ల	100	27	-
దొర్నిపాడు	65	12	-
ఉయ్యాలవాడ	50	6	-
సంజామల	66	0	10
కొలిమిగుండ్ల	30	-	-
అవుకు	82	10	
మొత్తం	4675	225	20

వారంలోగా పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ



నంద్యాల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని అర్హులైన రైతులకు వారం లోపల పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేస్తాం. డివిజన్‌లోని పాణ్యం, గడివేముల, బండిఆత్మకూరు, మహానంది, నంద్యాల, గోస్పాడు మండలాలకు ఒక్కో మండలానికి 100 క్వింటాళ్ల జీలుగలు మంజూరయ్యాయి. పాణ్యం, నంద్యాల మండలాలకు 50 కిలోల పిల్లిపెసర మంజూరైంది. బయోమెట్రిక్ విధానం ద్వారా పంపిణీ చేస్తాం

-మోహన్‌రావు, నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి

నోటీస్ బోర్డు

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి కోర్సులలో చేరుటకు ఈ నెల 15 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఇంటర్ ఒరిజనల్ టీసీ, ఇంటర్ మార్కుల పట్టిక, టెన్త్ మార్కుల లిస్ట్, ఫొటో, 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్, రూ. 200 ఆన్‌లైన్ అడ్మిషన్ ఫీజు తీసుకొచ్చి కార్యాలయంలో పేర్లను రిజిష్టర్ చేసుకోవాలన్నారు.

స్పోర్ట్స్

టెన్నిస్‌బాల్ క్రికెట్ విజేత నంద్యాల జట్టు

చాగలమర్రి: రాష్ట్ర స్థాయి 4వ జూనియర్స్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో నంద్యాల జట్టు విజయం సాధించి ప్రథమ బహుమతి గెలుచుకుంది. మూడు రోజులుగా మండల కేంద్రం చాగలమర్రిలో జరుగుతున్న ఈ పోటీలు శనివారం ముగిశాయి. చివరిరోజు వైఎస్సార్ కడప, నంద్యాల జట్లు ఫైనల్ మ్యాచ్‌లో తలపడగా నంద్యాల జట్టు 62 పరుగల తేడాతో విజయం సాధించి చాంపియన్‌గా నిలించింది. కార్యక్రమంలో రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రేవంత్, కడ్డీ మహబూబ్‌బాషా ఉన్నారు

ఈరోజ

అభయాంజనేయస్వామి జయంతి వేడుకలు

నంద్యాల(అర్బన్): స్థానిక గోపాల్‌నగర్‌లో వెలసిన శ్రీవరసిద్ధి వినాయక అభయాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు సామూహిక మహామంగళ హారతి, హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

అభివృద్ధి పథంలో పట్టణం





నూతనంగా నిర్మించిన బ్రిడ్జి, శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

- నూతన వంతెన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(సిటీ): పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక 35వ వార్డు సలీంనగర్‌లో వార్డు కౌన్సిలర్ చింపింగ్ బాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా రూ.1.35 కోట్లతో నూతన బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పారవి మాట్లాడుతూ రాకపోకలకు సలీంనగర్, శ్యాంనగర్ ప్రాంత వాసులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వారికి చామకాల్వ మీద బ్రిడ్జిని నిర్మించామన్నారు. నంద్యాల పట్టణంలోని ప్రతి వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీలను నిర్మిస్తున్నామన్నారు. ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను తీసుకెళ్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి కలిగిస్తున్నామన్నారు. ప్రతిపక్ష నాయకులు సెల్ఫీలు దిగడం తప్ప అభివృద్ధి చూడరన్నారు. ప్రజలు తమ వైపు ఉన్నారని, వారు ఎన్ని కుట్రలు పన్నినా ఫలితం ఉండదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతుందని, దీంతో టీడీపీ నాయకులకు ఏం చేయాలో పాలుపోవడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజ లు మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కడతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, వైస్ చైర్మన్లు పాంశావలి, కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, రాష్ట్ర దృశ్యకళ చైర్మన్ సునీత అమృతరాజ్, వార్డు నాయకులు, మాజీ కౌన్సిలర్ మహబూబ్‌బీ, పెద్దమౌలాలి, అథావుల్లా, చింపింగ్ రెహెమాన్, ఏకే ఖాన్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీ పక్షం

- గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం
- గడగడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బిజేంద్రానాథ్‌రెడ్డి

శిరివెళ్ల: ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు నమ్మరని, వారు వైఎస్సార్‌సీపీ పక్షమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రానాథ్‌రెడ్డి అన్నారు. హామీల అమలులో తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన స్థానిక 1వ గ్రామ సచివాలయంలో పర్యటించారు. 3, 4, 5 వార్డులు బలిజపేట, చాకలిపేట, ఆకుతోట పేటలలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా కల్పించిన లబ్ధిని వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ 129 హామీలు ఇస్తే అందులో ఇప్పటికే 125 హామీలను అమలు చేసిందన్నారు. 2014 లో టీడీపీ ఇచ్చిన హామీలను 1 శాతం కూడా అమలు చేయలేదని విమర్శించారు. జాబు రావాలంటే బాబు రావాలి, రైతు, డ్వాక్రా మహిళల రుణమాఫీ కావాలంటే బాబు రావాలని ప్రచారం చేసి చివరకు మోసం చేశారన్నారు. అందుకే 2019 ఎన్నికల్లో బాబుకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. తమ ప్రభుత్వం చెప్పిన ప్రతి హామీని అమలు చేస్తుండటంతో ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజు, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, దేవస్థానం చైర్మన్ తిమ్మరాయుడు, బోయలకుంట్ల సర్పంచు జింకల నాగన్న, వీరారెడ్డిపల్లె సర్పంచు శివారెడ్డి, మాజీ జెడ్పీటీసీ నజీర్, మైనారిటీ నాయకుడు ముల్లా అన్వర్‌బాషా, ముడిమేల నాగరాజు, పెద్దన్న దొర్నిపాటి రఫీ, ఎంపీడీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఈఓ ఆర్డీ సాల్మన్‌రాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



వృద్ధురాలికి ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

రాష్ట్రంలో జనరంజక పాలన



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల: సీఎం వైఎస్‌జగన్ రాష్ట్రంలో జనరంజక పాలన అందిస్తున్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 5వ వార్డులో కౌన్సిలర్ ఆరిఫ్‌నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గ్రామాలు, పట్టణాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ చేసి జగనన్న కాలనీలను నిర్మించారన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో చంద్రబాబునాయుడు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్‌చైర్మన్ పాంషావలి, సాదిక్‌బాషా, సమ్మత్, తబ్రేజ్, మాజీ కౌన్సిలర్ అనిల్‌అమృతరాజ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

ఉయ్యాలవాడ : వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నర్సిపల్లె గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.15 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఆర్థిక సంవత్సరం మరింత చేయూతనందిస్తూ స్థానిక సంస్థల నిర్వహణకు నిధులు విడుదల చేస్తున్నాయన్నారు. దీంతో గ్రామాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలతో పాటు సుందరీకరణ పనులు చకచకా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మీదేవి, మండల అధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ, గ్రామ సర్పంచ్ పల్లె గురుప్రసాద్‌రెడ్డి, మండల రైతు సలహా కమిటీ చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి, గ్రామ నాయకులు పల్లె శివశంకర్‌రెడ్డి, పల్లె వెంకట శివారెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రామకృష్ణారెడ్డి, ఫణీత్ క్రిష్ణ,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నర్సిపల్లెలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

చాపిరేవులలో ట్రాఫిక్ ఆంక్షలు

బొమ్మలసత్రం: చాపిరేవుల గ్రా మంలో ఈనెల 15 నుంచి 17 వరకు దేవర జరుగనుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు తా లూకా ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. చాపిరేవుల గ్రామం నుంచి మిట్నాల, తేళ్లపురి గ్రామాలకు వెళ్లే వాహనాలు నంద్యాల నుంచి కానాల వైపుగా పాండురంగాపురం తొగర్చేడు వైపు వెళ్లాలన్నారు. వాహనదారులు ఈ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు.

15న చలో కలెక్టరేట్

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మిక సమస్యలపై ఈ నెల 15న చేపడుతున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలకృష్ణ కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం అయన ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. నాయకులు బాల ఉసేని, వెంకటేశ్వర్లు, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిష్ఠోత్సవం



ముత్తలూరులో పూజలు చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని ముత్తలూరులో గోవిందమాంబ సమేత జగద్గురు వీర బ్రహ్మేంద్రస్వామి ప్రతిష్ఠోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కొంత కాలం క్రితం గ్రామ పెద్దలంతా ఏకమై నూతనంగా వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయం నిర్మించాలని తీర్మానించారు.అనుకున్నదే తడవుగా గ్రామస్తులు చందాలు వేసుకుని కొంత సొమ్ము పోగు చేశారు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మెన్ గంధం రాఘవరెడ్డి తన వంతు సహాయం అందించారు. దీంతో ఆలయ నిర్మాణం పూర్తి చేసి విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠోత్సవం చేపట్టారు. ఉత్సవాలు బ్రహ్మం గారి వారసత్వంలోని 8వ తరానికి చెందిన వెంకటాద్రి, బ్రహ్మం గారి మఠం పీఠాధిపతులైన వీర శివకుమార్ సమక్షంలో సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మెన్ గంధం రాఘవరెడ్డి, నాయకులు గోపవరం నరసింహారెడ్డి తదతరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేడుకకు వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాలు ముగిశాక ఆయనను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల గ్రామంలో లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ అభయాంజనేయ స్వామి, ఇంజేడు శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

తిరుమంజన సేవ

నంద్యాల(వ్యవసాయం): మన ఊరు, మన గుడి, మన బాధ్యత నిర్వాహకుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక బైటిపేట కోదండరామస్వామి ఆంజనేయ స్వామి దేవాలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శివకుమార్‌రెడ్డి, రాంప్రసాద్ మాట్లాడుతూ తమ సంస్థ ఏర్పడి సంవత్సరం అయిన సందర్భంగా దేవాలయాల శుభ్రత పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, మారం శేషయ్య, రఘువీర్, హర్ష, తదితర సేవకులు పాల్గొన్నారు.

సత్వర న్యాయమే లోక్ అదాలత్ ధ్యేయం



లోక్ అదాలత్‌లో కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి వాసు

నంద్యాల(వ్యవసాయం): కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ ధ్యేయమని మూడవ అదనపు జిల్లా జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ వాసు పేర్కొన్నారు. శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవ ఎంత పెద్దదైనా ఒక క్షమాపణతో సద్దుమణుగుతుందన్నారు. చిన్నచిన్న సమస్యలకు న్యాయస్థానాల్లో కాకుండా లోక్ అదాలత్‌ను ఆశ్రయించాలన్నారు. దీంతో సమయం, డబ్బు ఆదా అవుతుందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీ కాగల కేసుల పరిష్కారం కోసం న్యాయవాదులు, పోలీసులు ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసుల్లో తీర్పుపై అప్పీలు ఉండవని సూచించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కక్షి దారులు ఆవేశంలో ఘర్షణ పడి, పరస్పరం కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరగకుండా ఆలోచనతో రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. లోక్‌అదాలత్‌లో సీసీ కేసులు, ఎస్‌ఐ యాక్ట్ కేసులు, ఎంసీ కేసులు, మోటార్ ప్రమాద కేసులు, ఇన్సూరెన్స్ కేసులు, క్రిమినల్, సివిల్, అత్యధికంగా ఎస్టీసీ తదితర 1637 కేసులను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు విజయశేఖర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, మహమ్మద్‌రఫీ, రఘుప్రకాష్, ప్రతాపరెడ్డి, లోక్‌అదాలత్ అధికారులు రామచంద్రారెడ్డి, భాస్కర్‌లు పాల్గొన్నారు.

రైల్వేట్రాక్ పైకి పశువులను వదిలితే కేసులు

నంద్యాల(రూరల్): పట్టణంలోని గుంటూరు - డోన్, నంద్యాల - కడప రైల్వే ట్రాక్‌ల పైకి ఎవరైనా మేత కోసం పశువులను వదిలితే కేసులు నమోదు చేస్తామని ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ జనార్దన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని మూలసాగరం, బొమ్మలసత్రం, నూనెపల్లె రైల్వే గేట్‌ల సమీపాల్లో నివాసం ఉండే ప్రజలు, రైల్వే ట్రాక్ సమీప గ్రామాల్లోని పశువుల యజమానులతో సమావేశమై రైల్వే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ట్రాక్ సమీపంలో సంచరించే పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్ల అంతికించాలని సూచించారు. అదేవిధంగా ట్రాక్ సమీపంలో నివసించే యువకులు రైలు వెళ్లే సమయంలో రైలు పైకి రాళ్లు రువ్వితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని హరినగరం గ్రామ సమీపంలో మోటర్ సైకిల్ మీద నుంచి కింద పడి ఓ వ్యక్తి గాయ పడ్డాడు. గోస్పాడు మండలం తేల్లపురి గ్రామానికి చెందిన నరసింహుడు శనివారం అహోబిలానికి వెళ్లాడు. అక్కడ స్వామి అమ్మవార్లకు పూజలు చేసి ఇంటికి తిరిగి వస్తున్నాడు. హరినగరం గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు మోటర్ సైకిల్ అదుపు తప్పి కింద పడ్డాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.